సాక్షి
వరంగల్

మంగళవారం | 6 | ఫిబ్రవరి | 2024



భక్తులకు మెరుగైన సౌకర్యాలు
మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు.
- 8లో▸



భవ్య కుటుంబీకుల రాస్తారోకో
భవ్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుధరావుపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం
ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పరీక్షలకు సిద్ధం కావాలి



రాయపర్తి: రానున్న పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులు అధైర్యపడకుండా ధైర్యంగా సిద్ధం కావాలని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మైలారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు సిద్ధమయ్యేలా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రిపరేషన్ క్లాసులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆజ్మీరా ఉమాదేవి, ఉపాధ్యాయులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



నర్సంపేట: భువనగిరి ఎస్సీ హాస్టల్లో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్దు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర వీరుల స్తూపం వద్ద ఆయా విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి ఎస్సీ హాస్టల్లో పదోతరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు హాస్టల్లో ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మృతికి కారణాలపై విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్, సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేశ్, ప్రశాంత్, వినయ్, రాకేశ్, ప్రమోద్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై ఉన్నతాధికారుల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కోపాకుల చెరువు కబ్జాపై విచారణకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అందులో భాగంగానే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అక్రమ పట్టాదారుల వివరాల కోసం జిల్లా స్థాయి అధికారులు వచ్చినట్లు సమాచారం. చెన్నారావుపేట మండల కేంద్రం శివారులోని సర్వే నంబర్ 388లో కోపాకులు చెరువు సుమారు 360 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. దానికి కింద 596 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుంది. అయితే కొందరు రైతులు రెవెన్యూ అధికారులకు డబ్బు ఆశచూపి చెరువు శిఖంతో పాటు మత్తడి భూమికి పట్టాలు చేసుకుని యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జా కోరల్లో కోపాకుల అనే శీర్షికతో కథనం సోమవారం ప్రచురించింది. దీంతో జిల్లా స్థాయి అధికారులు ఎంత మందికి పట్టాలు ఇచ్చారు. ఏ సంవత్సరంలో ఇచ్చారు. ఆ సమయంలో తహసీల్దార్ ఎవరు అనే కోణంలో వివరాలు సేకరించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తీసుకుని సంబంధిత అధికారులు, రైతులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. దీంతో ఆక్రమణకు గురవుతున్న చెరువు శిఖంపై కథనాన్ని ప్రచురించిన సాక్షికి ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



నర్సంపేట: కేంద్ర ప్రభుత్వం పదేళ్లలో ప్రవేశపెట్టిన పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలని మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈమేరకు 'గావ్ చేలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ బూత్‌లో ఒక ప్రవాసి వెళ్లి అభిప్రాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ, తిలోక్, డాక్టర్ కంభంపాటి ప్రతాప్, డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, బాల్నె జగన్, రేవూరి నర్సింహారెడ్డి, జల్లి మధు, తడుక అశోక్, పుట్ట కవిత, మామిడి హైమావతి, గూడూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్..టెన్షన్!

వర్ధన్నపేట మున్సిపాలిటీలో హైటెన్షన్
- రేపు అవిశ్వాస సమావేశానికి ఏర్పాట్లు
- చైర్‌పర్సన్ అరుణ భవితవ్యంపై చర్చ
- నెగ్గుతుందా, వీగుతుందా అనే లెక్కలు
- ఎనిమిది మంది మద్దతిస్తేనే గెలిచేది



వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం

సాక్షి, వరంగల్: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి వరుసగా అవిశ్వాస గండం గడగడలాడిస్తోంది. ఇప్పటికే నర్సంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గుంటి రజినీపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినా కూడా ఆ పార్టీకి కొంతమంది కౌన్సిలర్లు రాజీనామా చేసిన విషయం తాజాగా ఉండగానే.. ఇప్పుడు వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఏం జరుగుతుందన్న చర్చ మొదలైంది. ఈ నెల 7న (బుధవారం) వర్ధన్నపేట మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశం ఉంటుందని అందరూ కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. నర్సంపేటలో మాదిరిగానే ఇక్కడ కూడా అవిశ్వాసం వీగిపోతుందా.. లేదా నెగ్గుతుందా అన్న చర్చలు మొదలయ్యాయి. వర్ధన్నపేట మున్సిపాలిటీలో చైర్మన్ అంగోటి అరుణ, వైస్ చైర్మన్ కొమాండ్ల యేలేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ జనవరి 11వ తేదీన తొమ్మిది మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు రిప్రజంటేషన్ చేస్తూ వరంగల్ ఆర్డీఓ వాసుచంద్రకు వినతిపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బుధవారం అవిశ్వాస సమావేశానికి మున్సిపాలిటీలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అవిశ్వాసం నెగ్గాలంటే ఎనిమిది మంది కౌన్సిలర్ల మద్దతు ఉంటే సరిపోతుంది.

అప్పుడు ఊపు.. ఇప్పుడేమో టెన్షన్

వర్ధన్నపేట మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, మరొకరు బీజేపీకి చెందిన వారు ఉన్నారు. అయితే చైర్‌పర్సన్ అంగోటి అరుణ, వైస్ చైర్మన్ కొమాండ్ల యేలేందర్ రెడ్డిలు ఇతర సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండానే ఇష్టమున్నట్లుగా నిర్ణయాలు తీసుకున్నారని, మున్సిపాలిటీలో అవినీతికి ఆజ్యం పోశారని వీరిని ఆ పదవుల నుంచి తప్పించాలంటూ వారిపై అవిశ్వాస తీర్మాన నోటీసును ఇచ్చారు. అయితే ఇప్పుడు ఈ తొమ్మిది మంది కౌన్సిలర్లలో ఎంత మంది అవిశ్వాస సమావేశానికి హాజరవుతారన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు తాము మద్దతు ఇవ్వమని అంటున్నారు. వీరిలో కాంగ్రెస్ చెందిన అభ్యర్థిని తనను చైర్మన్‌గా ఎన్నుకుంటానంటే మద్దతునిస్తానని ఇప్పటికే తోటి కౌన్సిలర్లకు చెప్పడంతో ఆమె హాజరుకావడం కష్టమేనని తేలింది. ఇక వీరిద్దరూ పోను మిగిలింది ఏడుగురే. అవిశ్వాసం నెగ్గాలంటే ఎనిమిది మంది మద్దతు తప్పనిసరిగా మారింది. ఈ సమయంలోనే మరొక బీఆర్ఎస్ కౌన్సిలర్ ఒకరు కూడా ఈ సమావేశానికి దూరంగా ఉండబోతున్నారన్న సమాచారంతో ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అతడి ఇంటి ముందు సోమవారం కూర్చొని నిరసన తెలిపారు. దీంతో మధ్యవర్తి ఒకరు సదరు కౌన్సిలర్‌ను తీసుకొచ్చే పూచీకత్తు నాది అని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక అవిశ్వాస సమావేశానికి ఒక్క రోజే సమయం ఉండడంతో ఏం జరుగుతుందోనన్న చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.

కౌన్సిలర్ల భవితవ్యం ఎటువైపో..

వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ సొంత నియోజకవర్గం కావడంతోనే ఇప్పుడు అందరి చూపు వర్ధన్నపేట మున్సిపాలిటీపై పడింది. ఇక్కడ అవిశ్వాసం నెగ్గుతుందా.. వీగుతుందా.. ఒక వేళ వీగితే ఇప్పటికే అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీలోనే కొనసాగుతారా అన్న చర్చ జరుగుతోంది. ఎందుకంటే నర్సంపేట మున్సిపాలిటీలో అవిశ్వాసం వీగినా కూడా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగమంటూ రాజీనామా చేసి కొందరు బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే సీన్ ఇక్కడ పునరావృతం అవుతుందా.. అంటే బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు వెళ్తారా, బీజేపీకి పోతారా లేదంటే బీఆర్ఎస్‌లోనే ఉండిపోతారా అన్నది చూడాలని అక్కడి జనాలు అంటున్నారు. ఏదిఏమైనా వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పేరు పరిశీలనలో ఉన్న అరూరి రమేష్ ఈ పరిస్థితిని ఎలా హ్యాండిల్ చేస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటికి బుధవారం నాటి సమావేశమే సమాధానం చెబుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పకడ్బందీగా ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ

- 14వ తేదీ వరకు తనిఖీలు
- కలెక్టర్ పి.ప్రావీణ్య



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: లోక్‌సభ–2024 ఎన్నికల్లో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. సోమవారం వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డు పరిధిలోని గోదాముల్లో భద్రపరిచిన వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో తెరవడం జరిగిందన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఈవీఎం, వీవీప్యాట్‌లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను సీసీ కెమెరాలతో రికార్డు చేస్తున్నామని, ఈ ప్రక్రియను ఎలక్షన్ కమిషన్ లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా చూసేలా ఏర్పాట్లు చేశామన్నారు. నోడల్ ఆఫీసర్‌గా డీఆర్‌ఓ వ్యవహరిస్తున్నారని, ఆయన పర్యవేక్షణలో ఎఫ్ఎల్‌సీ పరిశీలన జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ కొనసాగుతుందని, ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలోకి రాకపోకలను నియంత్రించేలా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎఫ్ఎల్‌సీలో పాల్గొనే సిబ్బందికి భోజన, ఇతర సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ వాసుచంద్ర, ఏసీపీ సతీష్‌బాబు, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాష్, శ్యాం, రజినీకాంత్, ఫైజుల్లా, అనిల్ కుమార్, పరంజ్యోతి, తహసీల్దార్లు, ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి

జీపీ ప్రత్యేక అధికారులు జవాబుదారీ తనంతో పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం జిల్లా పరిషత్‌లో ప్రత్యేక అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ ప్రత్యేక అధికారికి మూడు గ్రామపంచాయతీలు పరిశీలించే బాధ్యత ఉందని, ప్రతిరోజు ఒక గ్రామ పంచాయతీ పరిశీలన చేస్తూ రోజూ చేయవలసిన కార్యక్రమాలపై ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని నర్సరీలలో మొక్కలకు నీటి సౌకర్యం కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని ప్రతిరోజు చేపట్టే కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు చేసే కార్యక్రమాలను గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలన సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. డీపీఓ కల్పన, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమీకరణ పెంచాలి

ఉపాధి హామీ పథకం కూలీల సమీకరణ పెంచాలి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈజీఎస్, ఏపీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. వారంలోపు ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాల్లో పురోగతి కనపడని అధికారులు సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, ఏపీఓలు, ఈసీలు, ఎంపీడీఓలు ఎంపీఓలు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- మార్కెట్‌ను సందర్శించిన రైతు సంఘం



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

వరంగల్: ఎనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువస్తున్న మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సోమిడి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆచార్య కూరపాటి వెంకట నారాయణ, కాసర్ల రాంరెడ్డి, సోమ రామమూర్తి, ఊరటి అంశాలరెడ్డి, మోకిడి పేరయ్య, ఎల్లయ్యల బృందం వరంగల్ మార్కెట్‌లోని మిర్చి యార్డును సందర్శించి మిర్చి కొనుగోలు విషయంపై రైతులను విచారించారు. అనంతరం మిర్చి కొనుగోళ్లపై రైతు సంఘం నాయకులు మార్కెట్ కార్యదర్శిని కలిసి వివరించారు. మిర్చి క్వింటాల్‌కు రూ.30వేల ధరతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా మార్కెట్‌లో రైతు సంఘం నాయకులు ఉన్న సమయంలోనే భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చిలుపూరు గ్రామానికి చెందిన మహిళా రైతు చిర్ర రమణక్క శ్వాస ఇబ్బందితో అస్వస్థతకు గురయ్యారు. ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎంకు తరలించారు. ఆమెతో వచ్చిన రైతులను విచారించగా ఎకరంలో మిర్చి సాగు చేయగా కేవలం 11 బస్తాలు దిగుబడి రావడం, వాటిని అమ్మితే వచ్చే డబ్బులతో అప్పులు తీరే అవకాశాలు లేక పోవడంతో ఆందోళనలకు గురై పడిపోయిందని నాయకులు తెలిపారు. ఇలాంటి ఇబ్బందులు పడకుండా మార్కెట్ ఆవరణలో పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.

నిధులు కరువు.. సేవకు సెలవు!

- ఎన్ఎస్ఎస్‌కు నిధుల పెంపు.. విడుదలలో జాప్యం
- మొత్తం రావాల్సిన నిధులు రూ. 2.67 కోట్లు
- విడుదలైనవి రూ.47 లక్షలు
- కానరాని ప్రత్యేక శిబిరాలు
- పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు తీసినా నిధుల వినియోగానికి ఇబ్బందులే

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సామాజిక సేవల్లో ముందుండేది. రాష్ట్రపతి చేతుల మీదుగా కూడా అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిధులు విడుదలవ్వక సేవలు అంతంతమాత్రంగానే అందించే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రం విడుదల చేసే నిధుల వినియోగంలో అనేక ఆంక్షలుండడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు ముందడుగు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల పెంపు..

కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో కలిపి మొత్తం 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100మంది చొప్పున మొత్తం 35,600లమంది వలంటీర్లున్నారు. స్వచ్ఛభారత్, ప్రజల్లో చైతన్యం కలిగించడం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాలకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు వెచ్చిస్తారు. గతంలో ఒక్కో యూనిట్‌కు రెగ్యులర్ కార్యక్రమాలకు రూ.16 వేలు ఉండేది. ఇప్పుడు రూ 27,500లకు పెంచారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్‌చే వారం రోజులు ఏదైనా గ్రామంలో 50 మంది వలంటీర్లతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తే గతంలో 22,500లు ఇచ్చేవారు. దాన్ని రూ.35 వేలకు పెంచారు.

కొత్తగా పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు

ఎన్ఎస్ఎస్‌కు విడుదల చేసే నిధులను జవాబుదారీతనంగా వెచ్చించేలా కేంద్ర ప్రభుత్వం 'పైభారత్ పోర్టల్'ను తీసుకొచ్చింది. ఆతర్వాత కొత్త పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంటు సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) ద్వారా బ్యాంకుల్లో ప్రతీ కళాశాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఖాతాలను ఓపెన్ చేయాలనడంతో ఎక్కువ శాతం కాలేజీలు ఓపెన్ చేశాయి. కొన్ని కళాశాలలు ఇంకా పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు కూడా తీయలేదు.

రూ.47 లక్షల నిధులే విడుదల

కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్‌కు గత విద్యాసంవత్సరంలో నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరం రూ.2.67 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉండగా.. రూ.47 లక్షలు విడుదలయ్యాయి.



నిధులు ఖర్చు చేయాలంటే ఇబ్బందులే

గతంలో వర్సిటీ అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి రెగ్యులర్ కార్యక్రమాల నిర్వహణకు నిధుల విడుదల చేసేవారు. పీఎఫ్ఎంఎస్ అకౌంట్, నిబంధనలు, పలు ఆంక్షలతో నిధులను వినియోగించుకోలేకపోతున్నారు. ఈనిధుల వినియోగానికి సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతి ఉండాలి. ఇదంతా ఒక ఎత్తయితే పలు సాంకేతిక సమస్యలూ తలెత్తుతున్నాయని కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత నెల 29న వరంగల్ కేంద్రంగా, 30న ఖమ్మం జిల్లాలో, 31న ఆదిలాబాద్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఇబ్బందుల తప్పడం లేదని ప్రోగ్రాం ఆఫీసర్లు వాపోతున్నారు.

వచ్చిన రూ. 47 లక్షల్లో దీంతో గత కొద్దిరోజుల క్రితం నిధులు తక్కువగా ఉండటంతో కేవలం 171 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ 27,500ల చొప్పున నిధులు ఆయా కళాశాలల యూనిట్లకు అధికారులు విడుదల చేశారు. ఆ నిధులన్నీ రెగ్యులర్ కార్యక్రమాలకే వెచ్చించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువగా ఉండే కళాశాలల్లో నాలుగైదు యూనిట్లు కూడా ఉంటాయి. కళాశాలలో ఎన్ని యూనిట్లు ఉన్నా.. ఒక్క యూనిట్‌కు మాత్రమే రూ 27,500ల చొప్పున వేశారు. గతంలో ప్రత్యేక శిబిరాల నిర్వహణ అనంతరం బిల్లులు పెట్టుకుంటే వర్సిటీ అధికారులు చెల్లించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో శిబిరాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఈసారి ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాలు కూడా జరగలేదు.

రెమ్యూనరేషన్ ఏది?

కేయూ పరిధిలో 356 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండేళ్ల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెమ్యూనరేషన్ విడుదల కాలేదు. గతంలో వీరికి ఒక్కొక్కరికి రూ. 6 వేలు ఉండగా.. రూ.8,500లకు పెంచారు. కానీ విడుదల చేయడం లేదు. దీంతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల పట్ల వారు కూడా విముఖత చూపుతున్నారు. నూతన విధానంతో అనేక ఇబ్బందులతో రాబోయే కాలంలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశం కూడా ఉంది.

తక్కువ నిధులు విడుదలయ్యాయి..



కేయూ పరిధి 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా.. రూ.2.67 కోట్లు రావాల్సి ఉంది. కానీ రూ.47 లక్షల నిధులే విడుదలయ్యాయి. అందులో 171 యూనిట్లకు విడుదల చేశాం. అయితే ఆనిధులను వినియోగంపై అవగాహన కల్పించాం. ఈనిధులు పూర్తిగా వినియోగిస్తే మరోసారి విడుదలయ్యే అవకాశం ఉంది. నిధుల కొరత ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై ప్రభావం చూపుతోంది.

– ఆచార్య ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్

'గృహజ్యోతి'కి డిస్కం సన్నద్ధం

- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేటి నుంచి తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ నంబర్ల నమోదు



జిల్లాల వారీగా గృహ వినియోగదారులు

జిల్లా	వినియోగదారులు
హనుమకొండ	3,45,302
వరంగల్	2,86,156
భూపాలపల్లి, ములుగు	1,93,257
జనగామ	1,69,375
మహబూబాబాద్	2,09,066

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు అమల్లోకి వచ్చాయి. ఇటీవల మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గృహజ్యోతి పథకం అమలుకు వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ డిస్కంలకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ప్రక్రియ షురూ..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని 16 జిల్లాల్లో 45,64,889 మంది గృహ వినియోగదారులున్నారు. ఈనెల 6 నుంచి బిల్లులు తీస్తున్నప్పుడే మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారులను కలిసి రేషన్ కార్డు, ఆధార్ నంబర్ తీసుకుని నమోదు చేయాలని సూచించారు. ఈమేరకు సిద్ధం చేస్తున్న సాఫ్ట్‌వేర్ మంగళవారం(నేడు) ఉదయానికి అందుబాటులోకి రానుంది. ప్రతి ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం (ఈఆర్‌ఓ)లో ఉదయం 9 గంటలకు స్పాట్ బిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డివిజన్ ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ వినియోగం, మీటర్ రీడింగ్, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల నమోదుపై అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ.. జిల్లా ఎస్ఈలు, డీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డివిజన్ల వారీగా సమావేశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికారులు మీటింగ్‌కు రావాలని స్పాట్ బిల్లర్ల కు సమాచారం పంపారు. ఇదిలా ఉండగా.. అద్దెకు ఉంటున్న కుటుంబాల ఆధార్, రేషన్ కార్డు నంబర్ నమోదుపై అధికారులు సందేహాలు వ్యక్తం చేయగా నివృత్తి చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్ నంబర్‌తో పాటు వారి రేషన్ కార్డు, ఆధార్‌నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియతో యజమానులకు ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. ప్రతి నెలా 15వ తేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీ చేస్తుంది. ఈనెల 15వ తేదీ నాటికి తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులు ఎంత మంది ఉన్నారో స్పష్టంగా తెలుస్తుంది.

పరిపాలన సమర్థవంతంగా నిర్వహించాలి

నర్సంపేట రూరల్: గ్రామాల్లో పరిపాలనను ప్రత్యేకాధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నర్సంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకుంటూ.. పరిష్కరించాలని సూచించారు. సీఈఓ రాంరెడ్డి, ఏపీడీ సాయిచరణ్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఖానాపురం: మండలంలోని మంగళవారిపేట హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మంజుల తెలిపారు. సోమవారం హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు చెందిన మాలోతు కవిత, మాచర్ల అంకిత, ఆబోతు సుమలత జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 9, 10, 11 తేదీల్లో జనగామ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిర్య, రమేష్, రాజు, సుధాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ నిర్వహణకు వసతులు కల్పించాలి

- డైరెక్టర్ విమల థామస్



మాట్లాడుతున్న విమల థామస్

వరంగల్: నర్సంపేట జిల్లా ఆస్పత్రిలో మెడికల్ కాలేజీ మొదటి సంవత్సరం నిర్వహణకు మౌలిక వసతులు సమకూర్చాలని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ విమల థామస్ ఆదేశించారు. సోమవారం నర్సంపేట ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రావీణ్యతో కలిసి పనుల పురోగతి, ఆస్పత్రిలో తాత్కాలికంగా మెడికల్ కాలేజ్ నిర్వాహణపై అధికారులతో కలిసి సమీక్షించారు. నిత్యం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నర్సంపేట జిల్లా ఆస్పత్రి మ్యాప్‌ను పరిశీలించి బ్లాక్‌ల వారీగా ఆస్పత్రి, మెడికల్ కాలేజీ నిర్వహణపై తగు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వైద్య కళాశాలలో తరగతులు, ఆస్పత్రిని ఏప్రిల్ నెలలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 250 పడకలతో నిర్మాణం ఉన్న నర్సంపేట జిల్లా ఆస్పత్రిలోని 3 బ్లాకుల్లో ఒక బ్లాక్ కళాశాలకు, 2 బ్లాకులు ఆస్పత్రికి వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎస్‌సి దేవేందర్ కుమార్, డీఈఈ రాజశేఖర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కిషన్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూన్యాయ శిబిరాలు వాయిదా

పెద్దవంగర: రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూన్యాయ శిబిరాలను వాయిదా వేసినట్లు లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఈ నెల 7,8, బొమ్మకల్లులో 16,17, అలాగే, జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో 12,13 తేదీల్లో నిర్వహించనున్న భూన్యాయ శిబిరాలను మరో తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ తండ్రి సోమవారం కన్నుమూశారు. దీంతో న్యాయ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేతిరెడ్డి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

జువైనల్ హోమ్‌కు బాలుడి అప్పగింత

నెల్లికుదురు: బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సెల్‌ఫోన్‌కు నెల్లికుదురు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నిత్యం అసభ్యకర మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో బాలిక మృతికి కారణమైన బాలుడిని సోమవారం వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీష్ కథనం ప్రకారం నర్సింహులపేటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేముల ప్రభాకర్‌రెడ్డి తన భార్యతో కలిసి 15 రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని లాకర్‌లో ఉన్న 8 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు


సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్


ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం జాతర
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- అధికారులతో సమీక్ష సమావేశం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం మేడారంలోని హరితహోటల్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్..అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం.. దేశంలోనే పెద్ద వన జాతరని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 6 వేల ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి ఆర్టీసీ క్యాంప్ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. జాతర సమయంలో సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ఎండీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతరలో ఆర్టీసీ.. ఇప్పటి వరకు లక్షా పదివేల మంది భక్తులకు సేవలు అందించిందని తెలిపారు. 70 వేల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మహాద్భుత ఘట్టం మేడారం జాతరని, భక్తుల సౌకర్యార్థం రూ. 105 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను మంత్రులు పొన్నం, సీతక్క ప్రారంభించారు. అనంతరం వీఐపీ పార్కింగ్ వరకు బస్సులో ప్రయాణించారు.

ఆర్టీసీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

మేడారంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే బస్సులు, పార్కింగ్ స్థలాలు, బస్ షెల్టర్లు, క్యూలైన్ వార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల షెల్టర్లు, తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలువాయిద్యాలతో మంత్రులు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం?

- మృతుడు, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సూసైడ్ నోట్ లభ్యం
- దీని ఆధారంగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి అరెస్టు!
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం/ హసన్‌పర్తి : కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి(35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డి (35) మృతి కేసు పలు మలుపులు తిరిగింది. తన ఆత్మహత్యకు కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి కారణమంటూ భాస్కర్‌రెడ్డి సూసైడ్ నోట్ లభించడం సంచలనంగా మారింది. సూసైడ్ నోట్‌లో చిట్‌ఫండ్ యాజమాన్యం కారణమని ఉండడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు కేయూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కమలాకర్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, రాగిడి తిరుపతిరెడ్డి మోసం కారణంగా భాస్కర్ రెడ్డి మృతి చెందాడని, ఈ ఘటనపై తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకుని కస్టమర్ల డిపాజిట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు జరపమని తేల్చి చెప్పడంతో పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. ఈ విషయంపై సుబేదారి సీఐ షూకుర్‌ను వివరణ కోరగా భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సూసైడ్ నోట్ అందజేశారన్నారు. దీంతో ఈ కేసులో సెక్షన్లు మార్పు చేశామన్నారు. భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు యాజమాన్యమే కారణమనే ఆరోపణలపై వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో అయోధ్య రైలు


కాజీపేటలో అయోధ్య రైలు వద్ద రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్–అయోధ్య వెళ్లే ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6:40 గంటలకు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ రీజన్స్ దృష్ట్యా ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేశ్‌కుమార్, కాజీపేట సీఐ సంజీవరావు, కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, రైల్వే అధికారులు, మెకానిక్ సిబ్బంది ప్రత్యేక రైలు వద్దకు చేరుకున్నారు. 6:55 గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా.. ఈ రైలులో కాజీపేట జంక్షన్ నుంచి ఎవరూ ఎక్కలేదని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల ప్రారంభం

కాజీపేట జంక్షన్ నుంచి కాజీపేట–అయోధ్య వరకు మంగళవారం నుంచి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. ఈమేరకు మంగళవారం అయోధ్య రైలును ప్రారంభించి పంపించే ఏర్పాట్లలో ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. 20 బోగిలతో కూడిన ఈప్రత్యేక రైలులో ఉమ్మడి జిల్లా నుంచి 1,300 మంది ప్రయాణికులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. బీజేపీ నాయకులు, అధికారులు అయోధ్య ప్రత్యేక రైలు అధికారికంగా పంపించే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు ప్రయాణికులు వెళ్లనున్నట్లు తెలిపారు. కాజీపేట–అయోధ్య, అయోధ్య–కాజీపేట (07223/07223) మధ్య 30 రైళ్ల సర్వీస్‌లను మార్చి 2వ తేదీ వరకు ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

భవ్య కుటుంబీకుల రాస్తారోకో

- తప్పుడు ప్రచారంపై ఆగ్రహం


రాస్తారోకో చేస్తున్న భవ్య కుటుంబ సభ్యులు

ఖానాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఇరువురు విద్యార్థినులు మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భవ్య మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆటోడ్రైవర్‌తో పాటు వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాస్తారోకో వద్దకు చేరుకుని స్పష్టమైన హామీ ఇవ్వాలని బైఠాయించారు. మృతదేహంతో రోడ్డుపైనే నిలవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేను పిలిపిస్తేనే రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వారిని శిక్షించండి..

'నా కూతురును చంపిన వారిని చంపేయండి.. అన్యాయంగా నా బిడ్డను పొట్టనబెట్టుకున్నారు..నా బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయి..అందరు కలిసి మా కుటుంబానికి అన్యాయం చేత్తాండ్లు.. నా బిడ్డ ఒంటిపై దెబ్బలు ఉన్నాయి. చంపినోళ్లను వదిలేయవద్దంటూ' భవ్య తల్లి లలిత రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. నా బిడ్డను చంపినవారిని వదిలేయొద్దు. వారిని కఠినంగా శిక్షిస్తేనే నా బిడ్డ ఆత్మ శాంతిస్తదంటూ బోరున విలపించారు. కాగా, ఎస్సై మాధవ్‌గౌడ్.. భవ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పూజలు.. మేకపిల్ల బలి
- పెద్దపహాడ్‌లో అర్ధరాత్రి హల్‌చల్..
- రెండు బైక్‌లు వదిలి కారులో పరార్
- 100 డయల్‌కు ఫోన్.. పోలీసుల విచారణ
- అదుపులో ఇద్దరు వ్యక్తులు


తవ్వకాలు చేపట్టిన గుంతలో మేక పిల్ల

జనగామ: జనగామ మండల పరిధి పెద్దపహాడ్ గ్రామం వెంకిర్యాలకు వెళ్లే దారి.. దండు సిద్దులు, కాటబోయిన రాములు వ్యవసాయ బావి వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు మాట్లాడుకుంటున్నారు. రెండు బైక్‌లు, ఓ కారులో అక్కడికు వచ్చిన వ్యక్తులు గతంలో ఉన్న గుంతలో నిమ్మకాయలతో పూజలు చేసి మేక పిల్లను బలిచ్చి అందులో వేశారు. సిద్దులు స్నేహితుడు అదే రోజు రాత్రి వెంకిర్యాలకు వెళ్తుండగా వ్యవసాయ బావి వద్ద కారు, బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో సమీపానికి చేరుకున్నాడు. మనుషుల కదలికలు కనిపించడంతోపాటు పాకలో ఉన్న పశువులు బయటకు వచ్చి అరుస్తుండగా.. సిద్దులుకు గ్రామస్తులకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లు అక్కడే వదిలేసి కారులో పారిపోయినట్లు సిద్దులు తెలిపారు. 100 నంబర్‌కు డయల్ చేయగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే ప్రదేశంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సంఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై సృజన్ మాట్లాడుతూ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేయలేదని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో అడవిలో పూజలు చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తుల ఇళ్లలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు వెల్లడించారు.

సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 8 నుంచి అమలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ స్టేషన్ వరకు 16 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 18.00 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం కాజీపేటకు ఉదయం 8.00 గంటలకు చేరుకుటుంది. ఈ రైలుకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నాగపూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రూ.200 కోట్లతో 'టెక్నికల్ హబ్'

- కార్యరూపం దాల్చనున్న మంత్రి సురేఖ కృషి
- తెలంగాణలో ఏకైక టెక్నికల్ సెంటర్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రూ.200 కోట్ల వ్యయంతో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా.. వాటిలో ఒక హబ్ ఖిలా వరంగల్ మండల పరిధి రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. మంత్రి కొండా సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. వరంగల్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో స్థాపించనున్న ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రధాన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి. టక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే హబ్ ఏర్పాటు ప్రకటనతో వరంగల్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు అభినందనలు తెలిపారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృత్యువాత

- రూ.2.50 లక్షల నష్టం


గొర్రెల కళేబరాలు

వేలేరు : మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండా గ్రామంలో కుక్కల దాడిలో గుగులోత్ చిరంజీవికి చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి కథనం ప్రకారం.. రోజుమాదిరిగానే గొర్రెల మందను తన వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. చిరంజీవి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా కొట్టం వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడగా మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా, గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హైనా దాడిలో దూడ..

తరిగొప్పుల: హైనా దాడిలో లేగదూడ మృత్యువాత పడింది. మండల కేంద్రానికి చెందిన పింగిళి యాదిరెడ్డి పశువుల పాకపై సోమవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి అందులో ఉన్న లేగదూడను హతమార్చింది. కాగా, కొద్ది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో హైనా దాడి చేసి దూడలను హతమారుస్తుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి హైనాను బంధించాలని కోరుతున్నారు.

కేయూ పాలకమండలి సమావేశం



కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సమావేశాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల కేయూ రిజిస్ట్రార్, ఇతర పరిపాలనాపదవుల్లో పలువురు ప్రొఫెసర్లను నియమించిన విషయం తెలిసిందే. వీరికి సంబంధించిన ర్యాటిఫికేషన్‌ను ఈసమావేశంలో పెట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్, ఎంటెక్ పరీక్ష ఫలితాల విడుదల


పరీక్షల ఫలితాలు చూపిస్తున్న వివిధ శాఖాధిపతులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యూజీ 3, 5 పీజీ 3 సెమిస్టర్, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్. ఎం.ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్.వి.పురుషోత్తంరెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 9,69 మంది విద్యార్థు హాజరుకాగా.. 743 మంది, పీజీ 3వ సెమిస్టర్‌లో 234 మంది పరీక్షలకు హాజరుకాగా.. 203 మంది, బీటెక్, బీఫార్మసీ 3, 5వ సెమిస్టర్లలో 591 హాజరుకాగా 432 మంది, ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో హాజరైన ఆరుగురు విద్యార్థులు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్‌లో హాజరైన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఓఎస్‌డి. డా.వీరవెంకటయ్య, ఆచార్యులు జి.శంకర్‌లింగం, వి.మల్లికార్జున్, ఎస్.కవిత, ఎస్.సుమ, ఎం.జగదీశ్వర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురి మృతి చెందారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు, ఆటో, కారు ఢీకొన్న ఘటనలో మరో యువకుడు, రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



సాయిప్రసాద్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మెరుగు సాయిప్రసాద్ (24) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బలంగా చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుచ్చయ్య–కమల దంపతుల కుమారుడు సాయిప్రసాద్ గ్రామంలోనే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం కాజీపేట మండలం వనమాలకనపర్తిలో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే ముందు భార్య శ్రీవాణికి ఫోన్ చేశాడు. అర్ధరాత్రి అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి బుచ్చయ్య ఫోన్‌చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రోగ్రాంకు పిలిచిన వారికి ఫోన్ చేసి అడుగగా ఎప్పుడో వెళ్లాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులు వనమాల కనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం కనిపించింది. వెంటనే సాయిచంద్‌ను లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందించిన జిల్లా ఫొటోగ్రాఫర్లు

తోటి ఫొటోగ్రాఫర్ మృతి చెందిన విషయం తెలియగానే సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, కర్ణకంటి వెంకటేష్, చాగంటి మణి, కేరపాటి సాంబయ్య, అనిల్, సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కీర్తి ప్రవీణ్, సంతోష్, అన్వేష్, గంటె ఉపేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాసిరాజిగూడెం సమీపంలో వ్యక్తి..


జానీ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ముల్కలపల్లికి చెందిన ఎండీ జానీ(45) ఖమ్మం బైపాస్‌లో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కాసిరాజిగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జానీని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, కారు ఢీ.. యువకుడి దుర్మరణం


శ్రీకాంత్ (ఫైల్)

కురవి: ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగిందని సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆటోను నడుపుకుంటూ మహబూబాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వెన్నం వెంకటేష్ కారును నడుపుకుంటూ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా సమీపంలోని రైస్‌మిల్లు వద్ద 365 జాతీయ రహదారిపై ఢీకొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోర్నకల్: గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన కోతుల వెంకన్న(60) పశువులను మేపేందుకు సోమవారం గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిలోమీటర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

పల్లె ప్రకృతివనంలో అగ్నిప్రమాదం



నల్లబెల్లి : మండల కేంద్రంలోని పెద్ద చెరువు శివారులోని పల్లె ప్రకృతి వనంలో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఎండిపోయిన ఆకులకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. పూలు, పండ్లు, నీడనిచ్చే సుమారు రెండు వేల చెట్లు దగ్ధమైనట్లు పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ తెలిపారు. సుమారు రూ.8 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు ఆయన చెప్పారు.

పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం గ్రామంలో మురాల అనిత మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. తొలుత అనిత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న నల్ల రవీందర్‌రెడ్డిని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టెంకరాల రాజేశ్వర్‌రావు కొడుకు దీపక్‌ను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గందె శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లీ శివాజీ, నూటెంకి సూరయ్య, నాయకులు రాజిరెడ్డి, అంబరగొండ రాజు, దామోదర్‌రెడ్డి, వినోద్, మాసాని రవి, సదానందం, పైడి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు సాధు నర్సింగరావు సోదరుడు చిరంజీవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న సోమవారం పరామర్శించారు. తొలుత మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, నాయకులు బాల్నె వెంకన్న, జున్నూతుల రాంరెడ్డి, నర్మెట్ట సాంబయ్య, కొడకండ్ల యాకయ్య, కుమార్, అశోద నర్సింగం, నవీన్, పాణి, తదితరులు ఉన్నారు.

మైలారంలో..

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐరెడ్డి ఎల్లారెడ్డిని అతడి తల్లి ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఆమె యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ మహమూద్‌ను అతడి నానమ్మ మృతి చెందగా పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ఉల్లెంగుల యాదగిరి, నర్సయ్య, గబ్బెట బాబు పాల్గొన్నారు.

అనాథ బాలికకు సాయం

రాయపర్తి : మండలంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన అనాథ బాలిక రేణుకకు అంబేడ్కర్ సంఘం, దాతల సహకారంతో పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి రూ.5 వేలతోపాటు రూ.70 వేల బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బాండ్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. రేణుక తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారడం బాధాకరమన్నారు. ఆమె విద్య, ఇతర అవసరాల కోసం దాతలు మరింత సాయం అందించేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఐత రాంచందర్, మాజీ సర్పంచ్‌లు గారె నర్సయ్య, చెడుపాక కుమారస్వామి, మాజీ ఎంపీపీ ఎల్లయ్య, నాయకులు గబ్బెట బాబు, గారె కిరణ్, ఐత యాకయ్య, ఐత మల్లేశ్, ఐత సంపత్, కందికట్ల సంతోశ్, కందుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి..

రేణుకకు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గారె భిక్షపతి రూ.4 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మహమూద్, నాయకులు గుగులోతు విజయ్, అఫ్రోజ్‌ఖాన్, ఉప్పల స్వామి, గారె బాబు, శంకర్, రియాజ్, నాగేశ్ పాల్గొన్నారు.

వైద్యం కోసం..

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన సుమన్ అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.10 వేల సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన రూ.10 వేలను సుమన్‌కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్‌లోని ఎంజీఎంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. కడు పేదరికంలో ఉన్న సుమన్‌కు వైద్యం కోసం బాలకిశోర్‌రెడ్డి స్పందించి రూ.10 వేల సాయం అందించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మర్రెడ్డి, ఆకుల రుద్రప్రసాద్, కందికొండ రాజు, అనిల్, మాదాసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుధరావుపేటలో కోడి భవ్య మృతదేహానికి సోమవారం ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. వివరాలు సేకరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. విద్యార్థినుల మృతిలో బాధిత కుటుంబానికి అనుమానాలున్నాయని చెప్పారు. ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు రాకముందే కిందకు ఎలా తీశారని ప్రశ్నించారు. తల్లిదండ్రులు వసతి గృహానికి చేరకముందే మృతదేహాలను మార్చురీకి తరలించడం చూస్తే ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు.



భవ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాయకులు

హాస్టల్ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతోనే హత్య చేసినట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలని, రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, మౌలానా, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్

నర్సంపేట : ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కళాశాల వృక్షశాస్త్ర సహాయ అధ్యాపకుడు మేడిశెట్టి నరేందర్ విధి నిర్వహణలో అందించిన సేవలకు గాను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో కళాశాల ఆవరణలో నరేందర్‌ను శాలువాతో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రిన్సిపాల్ నవీన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మెరుగైన సమాజ నిర్మాణంలో అధ్యాపకులు కీలకమని చెప్పారు. నరేందర్ భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన సేవలు అందించి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలలో బొటానికల్ గార్డెన్, తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో కళాశాలలో పచ్చదనం పెంపొందించడానికి విశేష కృషి చేశారని తెలిపారు.



నరేందర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

2007లో నరేందర్ నాటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా జూనియర్ లెక్చరర్ స్థాయిలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నారని గుర్తు చేశారు. అనంతరం నరేందర్ మాట్లాడారు. తనకు పురస్కారం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమేశ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శ్రీనాథ్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, ఈడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ టి.సుమతి, ఎం.శైలజ, డాక్టర్ జె.లకన్‌సింగ్, పూర్ణ చందర్, బి.రమేశ్, సమ్మయ్య, సత్యనారాయణ, డాక్టర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేట రూరల్ : ఐక్యపోరాటాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని ఎంసీపీఐ (యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి తెలిపారు. మండలంలోని మాదన్నపేటలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ప్రజాధనాన్ని దోచిపెడుతోందని తెలిపారు. మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా మతతత్వ విధానాలకు పాల్పడుతూ ప్రజాసమస్యలను, హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌కు పార్టీ మద్దతు పలుకుతోందని చెప్పారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశెట్టి సదానందం, అనుమాల రమేశ్, గాదగోని బాబు, వక్కల రాజమౌళి, గుర్రం రవి, కేశెట్టి శ్రీనివాస్, ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి



తాబేటి లింగమూర్తి



పార్నంది లలిత్‌కుమార్

వర్ధన్నపేట : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు తాబేటి లింగమూర్తి కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గుగులోతు విజయ్ ఆధ్వర్యంలో మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాబేటి లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా పార్నంది లలిత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా టి.శేఖర్, ఎం.శుభప్రియ, కోశాధికారిగా ఎస్.రాజు, కార్యదర్శులుగా జి.మదన్‌లాల్, కనకయ్య, జి.వెంకటస్వామి, జిల్లా డెలిగేట్‌లుగా ఆర్.అనిల్‌కుమార్, జి.సోమన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు 3 డీఏలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని చెప్పారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల డీఏలను మంజూరు చేయడంతోపాటు పీఆర్సీ ఎరియర్లను విడుదల చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

లింగ వివక్షే సమానత్వానికి అడ్డంకి



ర్యాలీ నిర్వహిస్తున్న రమాదేవి, తదితరులు

● ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి

దుగ్గొండి : లింగ వివక్షే స్త్రీ పురుష సమానత్వానికి ప్రధాన అడ్డంకిగా నిలుస్తోందని ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. ×బేటీ పడావో.. బేటీ బచావో× కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. బాలబాలికలను తల్లిదండ్రులు సమాన దృష్టితో చూడాలని సూచించారు. విద్యార్థి దశలోనే బాలబాలికల్లో వివక్షతపై అవగాహన పెంచి చైతన్యవంతం చేయాలని చెప్పారు. లింగ వివక్షత, బాలబాలికల నిష్పత్తి, బేటీ బచావో, బేటీ పడావో స్కీమ్, బాలల హక్కులు, బాల్య వివాహాల చట్టం, బాలల హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100 గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పల్లె దవాఖాన వైద్యుడు హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యాయులు, శ్రీనివాస్, మాధవి, సుమలత, సుధీర్‌కుమార్, మాధవరావు, కమలాదేవి, నాగరాజు, ప్రదీప్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానంతోనే జీవితంలో ఉన్నతి

నల్లబెల్లి : ఆత్మజ్ఞానంతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి తెలిపారు. మండలంలోని మేడిపల్లిలో సోమవారం నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, వేమన పద్యాలను సమాజంలోని ప్రతీఒక్కరు ఆచరిస్తూ ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంతమైన జీవితం గడపాలంటే ఆధ్యాత్మికత కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరస్వామి, విజయ, లలిత, సుమలత, ధనికా రవి, సుష్మ, హేమలత, పాపక్క, నవ్యశ్రీ, రేఖ, స్వరూప, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కృష్ణవేణి, సభ్యులు

మానవ విలువలపై అవగాహన కీలకం

వర్ధన్నపేట : విద్యార్థి దశ నుంచే పిల్లలకు మానవ విలువలపై అవగాహన కల్పించడం కీలకమని ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త బంక మాణిక్యరావు తెలిపారు. ఈ దిశగా విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలోని అంబేడ్కర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మాణిక్యరావు మాట్లాడారు. విద్యార్థులు మానవ విలువలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే మానవ విలువైన అవగాహన పెంచుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని మొక్కలను నాటి వాటిని వృక్షాలుగా ఎదిగేలా చొరవ చూపాలని చెప్పారు. తల్లిదండ్రులను, చదువు చెప్పే గురువులను గౌరవించి పూజించాలని విద్యార్థులకు తెలిపారు. నృత్యాలు, పాటలతో విద్యార్థులకు అర్థం అయ్యేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సునిత, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో నృత్యం చేస్తున్న మాణిక్యరావు

చైతన్యమే లక్ష్యంగా మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, టీచర్లు

దుగ్గొండి : ఉపాధ్యాయుల్లో చైతన్యం నింపడం, సామాజిక బాధ్యతను పెంచడమే లక్ష్యంగా ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో టీపీటీఎఫ్ విద్యా, వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తొగర్రాయి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి, ఉపాధ్యాయులు సారయ్య, రఘు, గుర్మీత్ కౌర్, ఐలయ్య, మల్లయ్య, పద్మశ్రీ, విష్ణువర్ధన్, నీరజ పాల్గొన్నారు.

లారీ అదుపుతప్పి డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



ఖానాపురం : లారీ అదుపుతప్పి డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని గంగదేవితండా శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. తండా శివారులోని పసునూటి కాల్వలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు ప్రొక్లెయిన్ మిషన్‌ను లారీలో తీసుకెళ్తుంగా ఎదురుగా ట్రాక్టర్ రావడంతో తప్పించబోయిన క్రమంలో లారీ అదుపుతప్పింది. దీంతో ప్రొక్లెయిన్ మిషన్ పంట పొలంలో పడిపోయింది. కాగా లారీ నుంచి దూకడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

పెద్దగుట్ట పరిరక్షణకు ఉద్యమిస్తాం



నిరసన తెలుపుతున్న కృష్ణ, గ్రామస్తులు

రాయపర్తి : పోరాటాలతోనే మండలంలోని కొలన్‌పల్లి, కేశవాపురం, ఆరెగూడెం, జయరాంతండా, ఎర్రకుంటతండా గ్రామాలను ఆనుకొని ఉన్న పెద్దగుట్టను పరిరక్షించుకోగలమని స్థానిక నాయకుడు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ చిలుముల కృష్ణ స్పష్టం చేశారు. ఆయన ఆధ్వర్యంలో కేశవాపురం గ్రామస్తులు ఆ గుట్ట వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. పెద్దగుట్టపై మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పర్యావరణ పరిరక్షణ కమిటీ వేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిగా మైనింగ్‌కు అనుమతి ఇచ్చారని ధ్వజమెత్తారు. సమస్యను ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. సదరు గుట్ట విషయంలో గతంలో 33 మందిపై కేసులు బనాయించారని వాపోయారు. గుట్టను మైనింగ్ నుంచి కాపాడుకునేందుకు ఐదు గ్రామాల నుంచి ప్రజలతో కమిటీలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒగ్గుల సురేశ్, చిలుముల సురేశ్, తూల్ల భాస్కర్, అయ్యప్ప, మొలుగూరి దేవయ్య, హరీశ్, సారంగం, తూల్ల యాదగిరి, పెరట్ల వెంకన్న, చిలుముల్ల రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి

పర్వతగిరి : అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలని చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, అంబేడ్కర్ సంఘం నాయకుడు డాక్టర్ నలిగంటి శరత్‌కుమార్ కోరారు. మండలంలోని అనంతారంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్, శరత్‌కుమార్ మాట్లాడారు. అంబేడ్కర్‌ను బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి సమసమాజ నిర్మాణానికి బాటలు వేశారని కొనియాడారు. అంబేడ్కర్‌ను సమాజంలోని ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిర్రు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓపీఎస్ సాధనకు కృషి

● రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్



నర్సంపేట : పాత పెన్షన్ స్కీమ్ సాధన కోసం కృషి చేస్తానని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.విక్రమ్‌కుమార్ తెలిపారు. స్థానిక సబ్ ట్రెజరీ ఆఫీస్‌లో ఎస్టీఓగా విధులు నిర్వహిస్తున్న టి.విక్రమ్‌కుమార్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోమవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ స్కీమ్‌ను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చేలా చొరవ తీసుకుంటానని తెలిపారు. విక్రమ్‌కుమార్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిన్నారపు బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిచంద్ర సోనబోయిన, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కునమల్ల శ్రీనివాసరావు, నర్సంపేట మండల అధ్యక్షుడు పాత శ్యాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీలం మల్లయ్య అభినందించారు.

ఎంపీ టికెట్ ఆదివాసీలకు ఇవ్వాలి

గూడూరు: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ టికెట్‌ను ఆదివాసీ సామాజిక వర్గానికే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈసారి మానుకోట ఎంపీ టికెట్ ఎట్టి వెంకన్నకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, వాగబోయిన చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ మాజీ పాలకవర్గానికి సన్మానం

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గటిక సుష్మ మహేశ్, పాలకవర్గాన్ని స్థానిక నాయకులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సుష్మ మాట్లాడారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చొరవ చూపినట్లు తెలిపారు. ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడంలో సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ దర్నోజు దేవేందర్, పంచాయతీ కార్యదర్శి, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

అల్పాహారం అందజేత

గూడూరు: మండలంలోని తీగలవేణి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన వెంకటకృష్ణారెడ్డి, కందాలం రాములు సహకారంతో ఉపాధ్యాయులు సోమవారం స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఫరూక్, ఉపాధ్యాయులు ధర్మానాయక్, పురుషోత్తం, సాంబయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తొర్రూరు రూరల్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో తలపెట్టిన టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పట్ల మధు కోరారు. కార్యక్రమంలో నాయకులు అమీర్, వినయ్, మహేష్, ప్రవీణ్, ప్రణీత్ పాల్గొన్నారు.

గ్రామైఖ్య సంఘాలను బలోపేతం చేయాలి

ఐనవోలు : గ్రామైఖ్య సంఘాలను మరింత బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్(బ్యాంకు లింకేజీ విభాగం) డీపీఎం మర్రిదాస్ అన్నారు. ఇటీవల రిపబ్లిక్ డే వేడుకల్లో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ఉత్తమ వీవోఏగా ప్రశంస పత్రాన్ని అందుకున్న కోదాటి మంజులను డీఆర్‌డీఓ, సెర్ప్ జిల్లా అధికారులు, మండల సమాఖ్య ప్రతినిధులు, ఈసీ సభ్యులు, కార్యాలయ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో సోమవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాఖ్య సంఘాల ప్రతినిధులందరూ పంథిని శ్రీరామ్, సాయిరాం వీవో సంఘాలను ఆదర్శంగా తీసుకుని సంఘాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చీకటి రాజ్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు జమున, రేణుక, అనిత, లక్ష్మీ, భవాని, సీసీలు ప్రశాంత్, శంకరయ్య, మోహన్‌బాబు, ఎల్లయ్య, శ్రీనిధి మేనేజర్ రమేష్, ఎంఎస్ అసిస్టెంట్ స్వరూప, కంప్యూటర్ ఆపరేటర్ బిర్రు అనూష, మానస వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు మడూరి జ్యోతి, రజిత, సునీత, మంజుల, సుమలత, నజీమా, మాధవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.51,116 విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన కరిమిళ్ల సావిత్రి–చంద్రయ్య దంపతుల కొడుకు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఉమారాణి–రఘువీర్ దంపతులు సోమవారం రూ.51,116 విరాళం అందజేశారు. ఉమారాణి–రఘువీర్ దంపతులను ఆలయ కమిటీ అభినందించి కృతజ్ఞతలు తెలిపింది.